నేడు విద్యుత్‌ ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్‌: 11 కేవీ సబ్జిమండి విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని సబ్జిమండి, వాటర్‌ట్యాంక్‌, పోస్ట్‌ ఆఫీస్‌, రైస్‌ మిల్‌, షోయబ్‌ హోటల్‌ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10:30 నుంచి 11 గంటల వరకు.. అలాగే ఆసిఫ్‌నగర్‌ విద్యుత్‌ ఫీడర్‌ పరిధిలోని ద్రౌపతి గార్డెన్‌, ఫ్రెండ్స్‌ కేఫ్‌, మాంగార్‌ బస్తీ తదితర ప్రాంతాల్లో 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. అలాగే కిషన్‌నగర్‌ ఫీడర్‌ పరిధిలోని హుడా కాలనీ, జిర్రా రోడ్డు గంజాషా దర్గా తదితర ప్రాంతాల్లో 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

మజ్లిస్‌తోనే డివిజన్‌ అభివృద్ధి



చాంద్రాయణగుట్ట: మజ్లిస్‌ పార్టీ హయాంలోనే ఉప్పుగూడ డివిజన్‌ అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని ఆ పార్టీ నాయకులు వర్కల నాగరాజు అన్నారు. డివిజన్‌లో పలు బస్తీలలో శుక్రవారం ఆయన వీధి దీపాలను అమర్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే అక్బరుద్దీన్‌ ఒవైసీ, ఉప్పుగూడ కార్పొరేటర్‌ ఫహద్‌, మాజీ కార్పొరేటర్‌ సమద్‌ బిన్‌ అబ్దాద్‌ కృషితో స్థానికంగా రోడ్లు, డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలు ఏర్పాటవుతున్నాయన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు బాబు, బాను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రమాబాయి జయంతి



వేడుకల్లో పరమేశ్వరీ సింగ్‌, మనోహర్‌ గైక్వాడ్‌

జియాగూడ: మాతా రమాబాయి భీమ్‌రావు అంబేడ్కర్‌ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం మంగళ్‌హాట్‌ ఇంద్రానగర్‌లో ఈ వేడుకలు పెద్ద ఎత్తున చేపట్టారు. మాజీ కార్పొరేటర్‌ పరమేశ్వరీ సింగ్‌, సీనియర్‌ నాయకులు మనోహర్‌ గైక్వాడ్‌తో పాటు పలువురు నాయకులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహర్‌ సొసైటీ నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం చేపట్టారు.

రేపు రామాచారికి అవార్డు ప్రదానం



గన్‌ఫౌండ్రీ: ఈ నెల 9న రవీంద్రభారతిలో లిటిల్‌ మ్యూజిషియన్స్‌ అకాడమీ వ్యవస్థాపకుడు కె.రామాచారికి వంశీ-కేవీ రమణ గ్లోబల్‌ మ్యూజిక్‌ అవార్డును అందజేయనున్నట్లు వంశీ ఇంటర్నేషనల్‌ సంస్థల అధినేత వంశీ రామరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర పూర్వ గవర్నర్‌ సీహెచ్‌. విద్యాసాగర్‌ రావు, సినీ దర్శకుడు రేలంగి నర్సింహారావు, పూర్వ సలహాదారులు డాక్టర్‌ కేవీ రమణాచారిలతో పాటు పలువురు ప్రముఖులు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామాచారి శిష్యబృందం చే సంగీత విభావరి, సాయి అర్చనచే శాస్త్రీయ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం



చాంద్రాయణగుట్ట: పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు చేకూరేలా కేంద్ర బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకు ఆదాయ పన్ను మినహాయింపు ఇవ్వడం గొప్ప విషయమని బీజేపీ ఉప్పుగూడ డివిజన్‌ అధ్యక్షుడు సాయి ప్రసాద్‌ అన్నారు. కేంద్రం తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ సాయిబాబానగర్‌లో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్‌ మాట్లాడుతూ..దేశంలో పేదరికం నిర్మూలనే లక్ష్యంగా మోదీ సర్కార్‌ పాలన కొనసాగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటేష్‌, బాల్‌రాజ్‌, దేవేందర్‌, రాజ్యలక్ష్మి, శ్యామల, సాయికుమార్‌, బాల్‌ నాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలి

ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌



విద్యుత్‌ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కార్వాన్‌ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌

గోల్కొండ: అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి విధులు నిర్వహించాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్‌ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో మెహిదీపట్నం, షేక్‌పేట్‌తో పాటు వివిధ డివిజన్లకు సంబంధించిన విద్యుత్‌ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్‌కు సంబంధించిన ఫిర్యాదులు కొంత కాలంగా తనకు ఫిర్యాదులు ఎక్కువ సంఖ్యలో వస్తున్నాయన్నారు. ప్రతిసారి ఈ విధంగా చిన్న చిన్న సమస్యలకు ఫిర్యాదులు వస్తే అధికారుల పనితీరుపై ప్రజలకు నమ్మకం పోతుందన్నారు. అధికారుల విధి నిర్వహణలో సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారులకు గానీ, ప్రజల నుంచి సమస్యలు ఎదురైతే నేరుగా తనకు తెలవచ్చునన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోవడం, విద్యుత్‌ తీగలు తెగిపడిపోవడం తరచూ జరుగుతూ వస్తుందని ఆయన పేర్కొన్నారు. విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్లల్లో అవసరమైన పనులు ఎప్పటికప్పుడు చేయిస్తూ ఉంటే ఇటువంటి దుర్ఘటనలు జరగవన్నారు. సుదీర్ఘ కాలంగా ఉన్న సమస్యల పరిష్కారానికి అధికారుల సలహాలు, సూచనలకు ప్రజలు ఉన్నతాధికారుల వద్దకు వస్తారని అయితే వారు ఎటువంటి సరైన సమాచారం లేకనే వెనుతిరుగుతున్నారన్నారు. అనివార్య కారణాల వల్ల విద్యుత్‌ స్తంభం గానీ, మినీ విద్యుత్‌ ట్రాన్స్‌ఫార్మర్‌ గానీ మార్చాల్సి వస్తే సంబంధిత వ్యక్తి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పని లేకుండా వెంటనే అవసరమైన చర్యలు తీసుకోని సమస్యను పరిష్కరించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీఈ చక్రపాణి, ఎస్‌ఈ సోమారెడ్డి, సెంట్రల్‌ ఎస్‌ఈ వెంకన్న, మెహిదీపట్నం డీఈ సుధీర్‌, బేగంబజార్‌ డీఈ ఫర్‌హత్‌ ఆలీతో పాటు నానల్‌నగర్‌ కార్పొరేటర్‌ మహ్మద్‌ నసీరుద్దీన్‌ తదితరులున్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కుల పంపిణీ..

షాదీముబారక్‌, కల్యాణలక్ష్మి పథకాలకు దరఖాస్తు చేసుకున్న వారికి తప్పకుండా న్యాయం చేయిస్తానని ఎమ్మెల్యే కౌసర్‌ అన్నారు. టోలిచౌకీ ఎస్‌ఎస్‌ గార్డెన్‌ ఫంక్షన్‌హాల్‌లో మొత్తం 112 కల్యాణలక్ష్మి, షాదీముబారక్‌ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదింటి ఆడబిడ్డల పెళ్లి కోసం ప్రభుత్వం ఈ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. అర్హులైన వారు అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్‌ మహ్మద్‌ నసీరుద్దీన్‌, నాయకులు హారూన్‌ఫరాన్‌, వజీఉజ్‌జమా, ఆలీముద్దీన్‌, అమీరుద్దీన్‌ తదితరులున్నారు.

మేరు కులస్తులకు పూర్తి సహకారం అందించాలి



మంత్రి శ్రీధర్‌బాబును కలిసిన పోల్కం శ్రీనివాస్‌ తదితరులు

అబిడ్స్‌: మేరు కులస్తులకు కాంగ్రెస్‌ ప్రభుత్వం పూర్తి సహకారం అందించాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రాల మేరు యువజన సంఘం అధ్యక్షుడు పోల్కం శ్రీనివాస్‌ అన్నారు. ఈ మేరకు శుక్రవారం మంత్రి శ్రీధర్‌ బాబును కలిసి మెమోరాండం అందజేశారు. అనంతరం పోల్కం శ్రీనివాస్‌ మాట్లాడుతూ..లక్షలాది మంది ఉన్న మేరు కులస్తుల కోసం కనీసం కుట్టు మిషన్లు కూడా ఇంత వరకు కాంగ్రెస్‌ ప్రభుత్వం ఇవ్వలేదన్నారు. మేరోళ్లకు కుట్టుమిషన్లు ఉచితంగా ఇవ్వకుంటే ఎలా జీవిస్తారని ఆయన ప్రశ్నించారు. ఇందిరమ్మ రాజ్యంలో మేరు కులస్తులకు న్యాయం జరిగే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. గత అసెంబ్లీ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్‌ పార్టీకి ఓట్లు వేసి కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా ఊమేరు కులస్థులు ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు సానుకూలంగా స్పందించారు. మేరు కులస్తుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. కార్యక్రమంలో శివకుమార్‌, నవీన్‌ కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో పాతబస్తీ యువకుడికి కాంస్యం



కాంస్య పతకంతో అబ్దుల్లా బిన్‌ జావిద్‌ జాబ్రీ

చార్మినార్‌: ఉత్తరాఖండ్‌లో జరిగిన 38వ జాతీయ క్రీడలు-2025లో పాతబస్తీకి చెందిన అబ్దుల్లా బిన్‌ జావిద్‌ జాబ్రీ విజయం సాధించి కాంస్య పతకం సొంతం చేసుకున్నారు. తెలంగాణ నుంచి కేవలం అబ్దుల్లా బిన్‌ జావిద్‌ జాబ్రీ మాత్రమే ఈ విజయం సాధించారని ఆయన కోచ్‌ హబీబ్‌ ముస్తాఫా తెలిపారు. గత నెల 28 నుంచి ఈ నెల 7వ తేదీ వరకు జరిగిన జాతీయ క్రీడా పోటీల్లో శుక్రవారం జరిగిన బాక్సింగ్‌ పోటీల్లో (92 ప్లస్‌ కిలోల కేటగిరిలో) అబ్దుల్లా బిన్‌ జావిద్‌ జాబ్రీ కాంస్య పతకం గెలుపొందారు. చాంద్రాయణగుట్ట బండ్లగూడకు చెందిన ఆయన హబీబ్‌ ముస్తఫా బాక్సింగ్‌ అకాడమీలో శిక్షణ పొందారు. ఉత్తరాఖండ్‌ నుంచి పాతబస్తీకి చేరుకున్న ఆయనను శుక్రవారం బంధు మిత్రులతో పాటు పలువురు క్రీడాకారులు అభినందించారని హబీబ్‌ ముస్తఫా తెలిపారు.

అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్‌ గౌడ్‌

అబిడ్స్‌: అబిడ్స్‌ జీహెచ్‌ఎంసీ-14 సర్కిల్‌ కార్యాలయంలో అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండడం లేదని గోషామహల్‌ నియోజకవర్గం బీఆర్‌ఎస్‌ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్‌ గౌడ్‌ ఆరోపించారు. శుక్రవారం అబిడ్స్‌ జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి ఆయన కార్యకర్తలతో కలిసి వచ్చారు. డిప్యూటీ కమిషనర్‌ కానీ, టౌన్‌ప్లానింగ్‌ ఏసీపీ కానీ అందుబాటులో ఉండడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ..కొన్ని రోజులుగా బదిలీ అయిన డిప్యూటీ కమిషనర్‌ స్థానంలో ఇంత వరకు ఎవ్వరిని నియమించలేదన్నారు. ఇన్‌చార్జిగా ఉన్న కార్వాన్‌ డిప్యూటీ కమిషనర్‌ శశిరేఖ ఒక్కసారి కూడా కార్యాలయానికి రావడం లేదన్నారు. టౌన్‌ప్లానింగ్‌ ఏసీపీ సయ్యద్‌ సైదుద్దీన్‌ అనారోగ్యంతో సెలవులో ఉన్నారన్నారు. ఆయన స్థానంలో కాప్రా ఏసీపీ కృష్ణ మోహన్‌ను ఇన్‌చార్జిగా నియమించారని ఆయన కూడా ఒక్కసారి అబిడ్స్‌ కార్యాలయానికి రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిరోజూ పనుల నిమిత్తం జీహెచ్‌ఎంసీ కార్యాలయానికి వస్తే అధికారులు లేకపోతే ఎవరికి ఫిర్యాదు చేయాలని ఆనంద్‌ కుమార్‌ గౌడ్‌ ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో విజయ్‌ ముదిరాజ్‌, మహేష్‌గౌడ్‌, రాకేష్‌ సింగ్‌, నరేష్‌, గిరీష్‌ తదితరులు పాల్గొన్నారు.

హాల్‌ టికెట్లు ఇవ్వని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి



ఇంటర్మీడియేట్‌ విద్యాశాఖ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్వీ ప్రతినిధులు

గన్‌ఫౌండ్రీ: హైదరాబాద్‌లోని పలు ప్రైవేటు జూనియర్‌ కళాశాలలు ఇంటర్‌ ఎగ్జామ్స్‌ హాల్‌ టికెట్‌ ఇవ్వకుండా విద్యార్థులను వేధింపులకు గురిచేస్తున్నారని గ్రేటర్‌ హైదరాబాద్‌ బీఆర్‌ఎస్వీ కో ఆర్డినేటర్‌ నవీన్‌ అన్నారు. ఇటువంటి కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం గన్‌ఫౌండ్రీలోని జిల్లా ఇంటర్మీడియేట్‌ విద్యాశాఖ అధికారి ఒడ్డెన్నకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పరీక్షలు సమీపిస్తున్న వేళ పలు జూనియర్‌ కళాశాలలు ఫీజులు కట్టని విద్యార్థులపై వేధింపులకు దిగుతున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నాయకులు సతీష్‌రెడ్డి, రామచర్ల నర్సింగ్‌, గుమ్మడి క్రాంతి, చంద్రకాంత్‌, సందీప్‌ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో అందుబాటులోకి బేసిక్‌ ఏఐ కోర్సులు

యాకుత్‌పురా: నిరుద్యోగులకు త్వరలో బేసిక్‌ ఆర్టిఫిషియల్‌ ఇంటెలిజెన్స్‌(ఏఐ) కోర్సులను అందుబాటులోకి తీసుకొస్తామని ప్రభుత్వ రంగా సెట్విన్‌ శిక్షణ సంస్థ మేనేజింగ్‌ డైరెక్టర్‌ వేణుగోపాల్‌ రావు తెలిపారు. పురానీహవేలీలోని సంస్థ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ..ప్రస్తుతం మార్కెట్‌కు అనుగుణంగా నిరుద్యోగులకు అవసరమైన కోర్సులను ప్రవేశ పెట్టేందుకు ముందుకెళ్తున్నామన్నారు. సంస్థ ఛైర్మన్‌ గిరిధర్‌రెడ్డి సారథ్యంలో శిక్షణ కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల హుస్నాబాద్‌, నల్గొండ, మహబుబ్‌నగర్‌, జహీరాబాద్‌ ప్రాంతాల్లో నూతన శిక్షణ కేంద్రాలను ప్రారంభించామన్నారు. బోడుప్పల్‌లో నూతన కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. బేసిక్‌ ఏఐ కోర్సులను అందుబాటులోకి తీసుకురావడానికి అమెరికాలోని ఓ ప్రముఖ కంపెనీతో చర్చలు జరుపుతున్నామని పేర్కొన్నారు.

ట్రాఫిక్‌ పోలీసుల స్పెషల్‌ డ్రైవ్‌



కారు బ్లాక్‌ ఫిల్మ్‌ తొలగిస్తున్న చార్మినార్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ సురేందర్‌

చార్మినార్‌: నిబంధనలకు విరుద్ధంగా వాహనాలకు ప్రొటోకాల్‌ సైరన్లను బిగించడంతో పాటు బ్లాక్‌ ఫిల్మ్‌లను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దక్షిణ మండలం ట్రాఫిక్‌ ఏసీపీ లక్ష్మణ్‌ హెచ్చరించారు. తాము నిర్వహించే తనిఖీలలో పట్టుబడితే వాహనాలను సీజ్‌ చేస్తామన్నారు. శుక్రవారం చార్మినార్‌ ట్రాఫిక్‌ ఇన్‌స్పెక్టర్‌ సురేందర్‌తో కలిసి ఆయన ముర్గీచౌక్‌-మూసాబౌలి, పేట్లబురుజు చౌరస్తాలలో స్పెషల్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ఈ తనిఖీలలో అక్రమంగా బిగించుకున్న 5 కార్ల సైరన్లను తొలగించగా..మరో 13 కార్ల అద్దాల బ్లాక్‌ ఫిల్మ్‌లను తొలగించి చలానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్‌ నిబంధనలు పాటించాలన్నారు. పరిస్థితుల తీవ్రతను బట్టి వాహనాలను సీజ్‌ చేయడం జరుగుతుందన్నారు.

శ్మశాన వాటికల్లో చెత్త తొలగింపు

యాకుత్‌పురా: రానున్న షబ్‌-ఎ-బారాత్‌ సందర్భంగా శ్మశాన వాటికలను శుభ్రపరిచి తమ పూర్వీకుల సమాధులకు పూజలు చేసేందుకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్‌ కార్పొరేటర్‌ మహ్మద్‌ వసీవుద్దీన్‌ తెలిపారు. శుక్రవారం ఆయన డివిజన్‌లోని మదీనానగర్‌, లండన్‌ బ్రిడ్జి ప్రాంతాలోని ముస్లిం శ్మశాన వాటికల్లో కొనసాతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..షబ్‌-ఎ-బారాత్‌ను పురస్కరించుకొని శ్మశాన వాటిల్లో చెత్తాచెదరం, చెట్ల కొమ్మలను తొలగించి గోడలకు రంగులు వేయిస్తున్నామన్నారు. తాత్కాలిక విద్యుత్‌ దీపాలును ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మజ్లిస్‌ పార్టీ నాయకులు, శ్మశాన వాటిక నిర్వాహకులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ మహ్మద్‌ వసీవుద్దీన్‌, నాయకులు

పాఠశాల స్థాయిలోనే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



విజయనగర్‌కాలనీ: పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని విద్యావేత్తలు గోపాల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. విజయనగర్‌కాలనీ నారాయణ ఈ టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థులు నాసా బయోలజి లునార్‌ ప్రాజెక్ట్‌ లార్డ్‌ గ్రూప్‌ లీప్‌ ఇన్‌ హెల్త్‌ స్పేస్‌ కాంపిటీషన్‌కు ఎన్నికైంది. ఈ సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌లో పని చేసిన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో అభినందించారు. అనంతరం విద్యావేత్తలు మాట్లాడుతూ..మానవ మనుగడ భూమిపై కాకుండా అంతరిక్షంలో మనుషుల జీవితం ఎలా ఉంటుందో అని విద్యార్థులు ఈ ప్రాజెక్ట్‌ ద్వారా పరిశోధనలు చేసిన తీరు ఆలోచింప చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కో ఆర్డినేటర్‌ చంద్రశేఖర్‌, ప్రిన్సిపాల్‌ గంగాకిరణ్‌, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

గోల్కొండ: గుడిమల్కాపూర్‌లోని భవానీ శంకర ఆలయ 10వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా పురోహితులు శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఈ కల్యాణ మహోత్సవానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బీజేపీ కిసాన్‌ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు దేవర శ్రీనివాస్‌, రాధాకిషన్‌యాదవ్‌, వెంకటేష్‌సాగర్‌ తదతరులున్నారు.



బీజేపీలో పనిచేసే వారికి ప్రాధాన్యం



గోల్కొండ: బీజేపీలో పనిచేసే వారికి ప్రాధాన్యం ఉంటుందని బీజేపీ హైదరాబాద్‌ సెంట్రల్‌ అధ్యక్షులు లంకల దీపక్‌రెడ్డి అన్నారు. అధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా ఆయనను శుక్రవారం గుడిమల్కాపూర్‌లో బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా దీపక్‌రెడ్డి మాట్లాడుతూ..దేశం కోసం పనిచేసే వారే బీజేపీలో ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవర వంశీ తదితరులున్నారు.

విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతీయులను విభజిస్తే సహించం



మాట్లాడుతున్న వేములవాడ మదన్‌మోహన్‌

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణులను వృత్తుల పరంగా విభజిస్తే సహించబోమని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌ వేములవాడ మదన్‌ మోహన్‌ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..తెలంగాణ రాష్ట్ర సాధనలో ప్రాణత్యాగాలకు వెరవకుండా ముందు నిలిచిన విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతీయుల మనోభావాలను కించపరిస్తే సహించబోమన్నారు. తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్‌ ఇటీవల జరిపింది కులగణననా..లేకా వృత్తుల గణననా అని తెలపాలని డిమాండ్‌ చేశారు. హైకోర్టు ఆదేశాలను అమలు చేస్తూ కమ్మరి, వడ్రంగి, ఇత్తడి, శిలా శిల్పి, స్వర్ణకార పంచదాయ వృత్తిదారులందరినీ కలిపే గుర్తించాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు లాల్‌కోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లే కృష్ణమాచార్యులు, కోశాధికారి రాగిఫణి రవీంద్రచారి, ఉపాధ్యక్షుడు శ్రీనివాసచారి, జీవన్‌, దేవరకొండ వీరాచారి, మహిళా విభాగం అధ్యక్షురాలు చిలుకూరి లక్ష్మీలతో పాటు వివిధ జిల్లాలకు చెందిన అధ్యక్ష కార్యదర్శులు పాల్గొన్నారు.

మోదీ ఆశయ సాధనకు కలిసికట్టుగా పని చేయాలి



జగదీష్‌ కుమార్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గోల్కొండ: మోదీ ఆశయ సాధనకు అందరూ కలిసికట్టుగా పని చేయాలని బీజేపీ కార్వాన్‌ డివిజన్‌ అధ్యక్షుడు ఉద్దడి జగదీష్‌కుమార్‌ అన్నారు. శుక్రవారం కార్వాన్‌లో జరిగిన కార్యక్రమంలో డివిజన్‌ మాజీ అధ్యక్షుడు దోర్నల శ్రీనివాస్‌ కార్యాలయ రికార్డును ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో ఎక్కడ ఎన్నికలు జరిగినా బీజేపీ విజయం సాధిస్తూ వస్తుందని, ప్రధాని మోదీ పాలన తీరుకు ప్రజలు ఆమోదముద్ర వేస్తున్నారన్నదానికి ఇది నిదర్శనం అన్నారు. తెలంగాణలో కలిబొల్లి వాగ్ధానాలు ఎన్నికల హామీలు ఇచ్చి కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కమిటీ సభ్యులు గంజి రఘునాథ్‌ తదితరులున్నారు.

మాదిగ అమరవీరుల త్యాగ ఫలితమే

నేటి ఎస్సీ వర్గీకరణ విజయం



నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సిములు

గన్‌ఫౌండ్రీ: ఎస్సీ వర్గీకరణ పోరాటంలో అసువులు బాసిన మాదిగ అమరవీరులను గుర్తించాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సిములు కోరారు. ఎస్సీ వర్గీకరణకు 2009లో అసువులు బాసిన సురేందర్‌ మాదిగ, మహేష్‌మాదిగల కుటుంబాలను శుక్రవారం అబిడ్స్‌లో ఆయన పరామర్శించారు. అనంతరం వారి విగ్రహాలకు పూలమాలలు, పాలాభిషేకం చేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..నేటి వర్గీకరణ విజయం అమరవీరుల త్యాగ ఫలితమేనని కీర్తించారు. అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం గుర్తించి ఆ కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, పక్కా ఇళ్లు కట్టివ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్‌ మాదిగ, మాదిగ స్టూడెంట్‌ ఫెడరేషన్‌ మాజీ జాతీయ అధ్యక్షులు రుద్రవరం లింగస్వామి మాదిగ, మాదిగ రిజర్వేషన్‌ పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షులు వెంకట్‌ మాదిగ, ప్రసాద్‌, నక్క వెంకటేష్‌ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

నాంపల్లి: మాన్గారోడీ సమాజ్‌ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శిగా మల్లేపల్లి డివిజన్‌ మాన్గార్‌ బస్తీకి చెందిన సకట్‌ లక్ష్మణ్‌లాల్‌ నియమితులయ్యారు. ఇటీవల మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో రెండు రోజుల పాటు జరిగిన జాతీయ స్థాయి సదస్సులో సమాజ్‌ వ్యవస్థాపకుడు ఉత్తమ్‌ శంకర్‌ మన్‌ఖర్‌, జాతీయ అధ్యక్షుడు బాబా సాహెబ్‌ రాక్‌పర్సే సకట్‌ లక్ష్మణ్‌లాల్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. అన్ని రంగాల్లో మాన్గార్‌ కులస్తులు రాణించాలని, ఈ దిశగా జాతిని జాగృతం చేసే కార్యక్రమాలను చేపడుతామని లక్ష్మణ్‌ లాల్‌ పేర్కొన్నారు.



నియామక పత్రాన్ని అందుకుంటున్న లక్ష్మణ్‌లాల్‌

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



జియాగూడ: డివిజన్‌లో అభివృద్ధి పనులను వేగంగా చేపడుతున్నామని కార్పొరేటర్‌ బోయిని దర్శన్‌ అన్నారు. శుక్రవారం జియాగూడలోని జైన్‌ మందిర్‌ లేన్‌లో రూ.24 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్‌ బీజేపీ నాయకులు రాజేందర్‌ దేగన్‌, పడాల అనంత కృష్ణ, మనీష్‌ జైన్‌, డివిజన్‌ అధ్యక్షులు రాజు, జగదీష్‌, మహేశ్వర్‌, జీత్‌శర్మ, రేవ్‌ శర్మ, రమేష్‌, రాజు, సుభాష్‌ తదితరులు పాల్గొన్నారు.

హాష్‌ ఆయిల్‌ సరఫరా చేస్తున్న వ్యక్తి అరెస్ట్‌

విజయనగర్‌కాలనీ: హాష్‌ ఆయిల్‌ సరఫరా చేస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్‌ చేసిన ఘటన శుక్రవారం టప్పాచబుత్ర పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. కుల్సుంపురా ఏసీపీ మహ్మద్‌ మునావర్‌, టప్పాచబుత్ర ఇన్‌స్పెక్టర్‌ ఎ.రాములు తెలిపిన వివరాల ప్రకారం..ఒడిశా కోరాపుట్‌ జిల్లాకు చెందిన లలిత్‌మండి అలియాస్‌ లలిత్‌(22), అదే రాష్ట్రానికి చెందిన శరత్‌ పూజారి వద్ద మత్తు పదార్థాలు తీసుకొని నగరంలో కావాల్సిన వారికి అందజేస్తుంటాడు. గత ఐదు రోజుల క్రితం శరత్‌ పూజారి నుంచి రూ.11.32 లక్షల విలువైన 1132 గ్రాముల హాష్‌ ఆయిల్‌ తీసుకొని టప్పాచబుత్ర ప్రాంతంలోని జిర్రాలో ఉన్న హర్మాన్‌ హోటల్‌ వద్దకు వెళ్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు సౌత్‌వెస్ట్‌ జోన్‌ టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ ఎస్‌.బాలస్వామి బృందం, టప్పాచబుత్ర పోలీసులు కలిసి నిందితుడిని అదుపులోకి తీసుకొని హాష్‌ ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. శరత్‌ పూజారి పరారీలో ఉన్నాడు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆకట్టుకున్న నాటక ప్రదర్శన

అబిడ్స్‌: ఎగ్జిబిషన్‌లో భువన విజయం నాటక ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంది. కళాకారులు విభిన్న తరహాలో నాటక ప్రదర్శన చేపట్టారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు భారతీయ సంస్కృతిని చాటే విధంగా ఈ నాటక ప్రదర్శన కొనసాగింది. కన్వీనర్‌ ముఖైర్‌ అహ్మద్‌ కళాకారులను సత్కరించి అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..ఎగ్జిబిషన్‌ సొసైటీ ఆధ్వర్యంలో సందర్శకులకు వివిధ రకాల సాంస్కృతిక నిర్వహిస్తున్నామన్నారు. పురాతన, ప్రస్తుత సామాజిక పరిస్థితులను చాటే విధంగా సందర్శకులకు సంస్కృతి తెలిసే విధంగా తమ కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో అడ్వైజర్‌ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో కళాకారులు, ముఖైర్‌ అహ్మద్‌, శ్రీనివాస్‌

ఆలయాల అభివృద్ధికి ప్రత్యేక కృషి



వేణుగోపాల స్వామి యంత్ర విగ్రహ గోపుర ప్రతిష్ఠాపనలో గోపాల్‌ సింగ్‌ తదితరులు

జియాగూడ: ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తానని సీతారాంబాగ్‌ దత్తాత్రేయ ఆలయ కమిటీ కోశాధికారి, ప్రముఖ సంఘ సేవకుడు గోపాల్‌ సింగ్‌ పేర్కొన్నారు. శుక్రవారం సీతారాంబాగ్‌లోని వేణుగోపాల స్వామి ఆలయ యంత్ర విగ్రహ గోపుర శిఖర ప్రతిష్ఠాపనోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గోపాల్‌ సింగ్‌ మాట్లాడుతూ..సీతారాంబాగ్‌లోని వేణుగోపాలస్వామి ఆలయం, దత్తాత్రేయ స్వామి ఆలయాలను అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నట్లు ఆయన వెల్లడించారు. వేణుగోపాల స్వామి యంత్ర విగ్రహ గోపుర శిఖర ప్రతిష్ఠాపనకు పూర్తిగా సహకరించిన గోపాల్‌సింగ్‌ను ఆలయ నిర్వాహకులు, స్థానికులు సన్మానించారు.